# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :125 EDITOR:CHERUKU UPENDAR, DATE : TUESDAY 12 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 125 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 12 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## సీఐడీపైనే అనుమానం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కీలక పాత్రధారి అని భావిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు హయాంలో ఆర్థికశాఖ ఉన్నతాధికారిగా పనిచేసిన పీవీ రమేశ్ ఈ కేసులో సీఐడీకి లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు. ఆస్టేట్‌మెంట్ ఆధారంగానే కేసు మిగతా 2లో...

# చంద్రబాబు @ 7691

## స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఏపీ మాజీ ముఖ్యమంత్రి అరెస్టు - 14 రోజుల పాటు రిమాండు





హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబును అర్ధరాత్రి రాజమండ్రి జైలుకు తరలించారు. ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు ఆయనకు జైల్లో ప్రత్యేక వసతులు కల్పించారు. అర్ధరాత్రి జైలుకు చేరుకున్న చంద్రబాబుకు అధికారులు ప్రత్యేక నెంబర్ కేటాయించారు. ఆయనకు 7691ను ఇచ్చారు. అంతకు ముందు సుదీర్ఘ వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆయన్ని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తీర్పు ఇచ్చింది. ఈ మిగతా 2లో...

## జీ-20 ఖర్చు రూ.4100 కోట్లు




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

జీబి20 సమావేశాలకు 30 మంది దేశాధినేతలతో పాటు 14 మంది అంతర్జాతీయ సంస్థల అధినేతలు హాజరయ్యారు...గ్రాండ్ సక్సెస్ అయింది. భారత్ మండపాన్ని నిర్మించింది. మురికివాడలను తొలగించింది. ఎక్కడికక్కడ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. భారతీయ సనాతన ధర్మాన్ని ప్రతిబింబించేలాగా చిత్రాలు రూపొందించింది. భారీ విగ్రహాలను ఏర్పాటు చేసింది. ఇక అతిథుల కోసం ప్రత్యేక విడిది గృహాలను కేటాయించింది. వారికి బస, భోజనాలు ఒక రేంజ్ లో ఏర్పాటు చేసింది.

శనివారం మొదలైన సభలు ఆదివారంతో మిగతా 2లో...

## అమరవీరులు

## ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని హైదరబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మారక చిహ్నం వద్ద మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక ముఠాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీరమరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృధా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో 1984వ సంవత్సరం నుండి ఇప్పటివరకు మన



రాష్ట్రంలో 22 మంది తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం చాలా బాధకరమన్నారు. విధి మిగతా 3లో...

## పాపం.. వాళ్లిద్దరికి ఎమ్మెల్సీ ఛాన్స్ లేనట్టే



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ సీఎం కేసీఆర్ కొత్తగా ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేయక తప్పదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం పంపిన పేర్లను ఆమోదించేందుకు గవర్నర్ సిద్ధంగా లేరని తెలుస్తోంది. ఇప్పటికే ఖాళీ అయిపోయి చాలా కాలం అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలను నామినేటెడ్ కోటాలో భర్తీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం జూలై 31న జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నా ఇంకా దానికి గవర్నర్ ఆమోదముద్ర లభించలేదు. ప్రభుత్వం పంపిన ఫైళ్లను రాజ్‌భవన్ పరిశీలిస్తూ ఉన్నది. నెల రోజులు దాటినా వారిద్దరి నియామకాలపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదు. వారికి అర్హతలు లేవన్నట్లుగా మాట్లాడటంతో... ఇక ఫైల్ మిగతా 2లో...

## 119 నియోజకవర్గాల్లో 6003 దరఖాస్తులు




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీ టికెట్లకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. 119 స్థానాలకు గాను 6003 దరఖాస్తులు వచ్చాయి. తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే టికెట్లకు చివరి రోజు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆదివారం ఒక్కరోజే 2781 దరఖాస్తులు వచ్చాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 4 నుంచి 10 వరకు మొత్తంగా 6,003 అప్లికేషన్లు వచ్చాయని తెలుస్తోంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు బీజేపీ దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు భారీగా పోటీ పడ్డారు. ఒక్కొక్కరూ 3, 4 స్థానాలకు అప్లై మిగతా 2లో...

## ప్రజల్లోకి భువనేశ్వరి, బ్రాహ్మణి !

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు ఊహించనంతగా మారిపోతున్నాయి. సాధారణంగా ప్రతిపక్ష నేతల అరెస్టులు, వారిపై కక్ష సాధిస్తున్నారని ప్రజలు అనుకునే వ్యవహారాలను ఎన్నికలకు ఏడాది ముంద ప్రభుత్వాలు చేయవు. తప్పని సరిగా అరెస్టులు లాంటివి చేయాల్సి వచ్చినా .. వారిపై ఉన్న అభియోగాలు, ఆధారాలు అన్నింటినీ ప్రజల్లోకి పెట్టి వీలైనంతగా చర్చ పెట్టి అప్పుడు అరెస్ట్ చేస్తారు. వేధిస్తున్నట్లుగా అరెస్ట్ చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తమకు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలో రాజకీయ పార్టీలకు ఓ పక్కా ప్రణాళిక ఉంటుంది. ఇప్పుడు టీడీపీ.. తమకు అలాంటి అవకాశం వచ్చినట్లుగా నిర్ణయానికి వచ్చామని ఇక



ఉపయోగించుకోవాలని రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ప్రజల్లోకి నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలు వెళ్లే అవకాశాలు ఉన్నాయని మిగతా 3లో...

## గద్వాల ఎమ్మెల్యేకు భారీ ఊరట



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డికి సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఎన్నికల వివాదంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం స్టే విధించింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఎన్నికల చెల్లదంటూ బీజేపీ నాయకురాలు డీకే అరుణ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. కృష్ణ మోహన్ రెడ్డి తప్పుడు అఫిడవిట్ సమర్పించారని.. ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన డీకే అరుణ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు... తీర్పు ఇచ్చింది. కృష్ణమోహన్ రెడ్డి తప్పుడు అఫిడవిట్ సమర్పించారని నిర్ధారణ కావడంతో కృష్ణమోహన్ రెడ్డిపై అనర్హతా వేటు వేసి.. డీకే అరుణను మిగతా 2లో...

## కోమటిరెడ్డి చుట్టూనే నల్గొండ జిల్లా


నల్గోండ- ప్రభాత సూర్యుడు

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ల ఖరారులో ఎంపీ కోమటిరెడ్డి అభిప్రాయం కీలకంగా మారింది . పార్టీ చేరికల్లోనూ ఆయన అనుమతి తప్పనిసరి అయిన వైనం కనబడుతోంది. ఫలితంగా జిల్లా రాజకీయం ఆయన చుట్టు తిరుగుతోంది. ఉమ్మడి నల్లగొండ రాజకీయమంతా ఇపుడు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చుట్టూ తిరుగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి ఎవరన్నా నాయకుడు కాంగ్రెస్ లో చేరాలన్నా.. అదే విధంగా కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపుల్లోనూ



కోమటిరెడ్డి అభిప్రాయం కీలకంగా మారింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మిగతా 4లో...

## లిక్కర్ స్కాంలో మళ్లీ దూకుడు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఢిల్లీ లిక్కర్ స్కాం రాజకీయంగా ఎంతో ప్రాధాన్య మున్న కేసు. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా ఇప్పటికీ జైల్లో ఉన్నారు. అయితే కొంత కాలంగా ఈ కేసులో దర్యాప్తు సంస్థల దూకుడు తగ్గింది. అప్రూవర్లుగా మారుతామన్న వారందరి విజ్ఞప్తులు ఆమోదిస్తోంది. ముఖ్యంగా సౌత్ లాబీకి చెందిన ఎక్కువ మంది నిందితులు క్షమాభిక్ష పిటిషన్లు దాఖలు చేశారు. దర్యాప్తు సంస్థలు కూడా సానుకూలత తెలిపాయి. తాజాగా లిక్కర్ కేసులో పేరున్నా ఇప్పటి వరకూ ఒక్క సారి కూడా విచారణకు హాజరు కాని మిగతా 2లో...

# లిక్కర్ స్కాంలో మళ్లీ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

వైఎస్ఆర్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అప్రూవర్ అయ్యారు. గుంభనంగా సాగిన ఈ వ్యవహారంలో ఈడీ కీలక చర్యలు తీసుకోబోతందన్న ప్రచారం ఢిల్లీలో గుప్పుమంటోంది. గత వారం రోజులుగా ఈడీ అధికారులు ఢిల్లీ లిక్కర్ సాకంలో కీలక వ్యక్తుల్ని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్సీ కవిత వద్ద గతంలో ఆడిటర్ గా పని చేసిన బుచ్చిబాబును రెండు రోజుల పాటు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి చెప్పిన సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి జరిగిన నగదు లావాదేవీల అంశంపైనా మరికొంత మందిని ప్రశ్నించినట్లుగా ఈడీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేతకు ఢిల్లీలో అన్ని పనులు చక్క బెట్టే వ్యక్తిని కూడా ప్రశ్నించినట్లుగా చెబుతున్నారు. త్వరలో కొంత మందికి నోటీసులు జారీ చేయబోతున్నారని.. విచారణకు పిలవబోతున్నారని అంటున్నారు. గతంలో ఢిల్లీలో కవితను విచారణను పిలిచి.. ఆమెకు సంబంధించిన ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఈడీ వాటిని విశ్లేషించింది. వాటి నుంచి ఎలాంటి సమాచారం సేకరించారో స్పష్టత లేదు కానీ.. సీబీఐ కోర్టుకు సమర్పించిన వివిధ పత్రాల్లో ఎమ్మెల్సీ కవితపై నిర్దిష్టమైన ప్రయోజనం పొందారని.. ఢిల్లీ లిక్కర్ స్కాంతో వచ్చిన సొమ్ముతో ఆస్తులు కూడా కొన్నారని వెల్లడించారు. తర్వాత ఇక కవితను విచారణకు పిలవలేదు. సౌత్ లాబీలో కీలక నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డితో పాటు మాగుంట రాఘవరెడ్డి కూడా అప్రూవర్లుగా మారారు. ప్రస్తుతం వారు బెయిల్ మీద ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో నిందితుల వద్ద నుంచి లంచాలు తీసుకున్నారని ముగ్గురు ఈడీ అధికారులను ఇటీవల సీబీఐ అరెస్టు చేసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలతో వారిని అరెస్టు చేశారు. ఈడీకి సంబంధించిన పవన్ కార్తికేయ అనే అసిస్టెంట్ డైరెక్టర్ రూ. 5 కోట్లు లంచం తీసుకుని కేసును నీరు గార్చరనే ఆరోపణలతో పవన్ తో పాటు అతని సిబ్బంది మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈడీ ఉన్నతాధికారులే ఆయనపై సీబీఐకి కంప్లైంట్ ఇచ్చింది. ఈ వ్యవహారం తర్వాత ఈడీ దూకుడు పెంచడం సహజంగానే సంచలనంగా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కాంకు రాజకీయ పరిణామాలకు గట్టి లింక్ ఉంది. ఎందుకంటే నిందితులంతా ముఖ్య రాజకీయ పార్టీలకు చెందిన వారే. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కుమార్తె.. వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మరో ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడి సోదరుడు, టీటీడీ బోర్డు మెంబర్ శరత్ చంద్రారెడ్డి వంటి వారు ఉన్నారు. ఇక ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను కూడా సీబీఐ ఓ సారి ప్రశ్నించింది. సిసోడియా జైల్లో ఉన్నారు. ఈ కేసును కొలిక్కి తెచ్చేందుకు ఈడీ దూకుడు చూపిస్తోందని అంటున్నారు. త్వరలో ఈ కేసు విషయంలో జరిగే పరిణామాలు రాజకీయంగానూ సంచలనం సృష్టించే అవకాశాలు ఉన్నాయి.

# 119 నియోజకవర్గాల్లో 6003 దరఖాస్తులు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్ నుంచి మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, దుబ్బాక నుంచి రఘునందన్ రావు, శేరిలింగంపల్లి నుంచి గజ్జల యోగానంద్, రాజేంద్ర నగర్ నుంచి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, షాద్ నగర్ నుంచి మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి, సనత్ నగర్ నుంచి ఆకుల విజయ, జనగామ నుంచి బేజాది బీరప్ప, పాలకుర్తి నుంచి యొడ్ల సతీష్ కుమార్, ముషీరాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ కూతురు బండారు విజయలక్ష్మి, గాంధీ నగర్ కార్పొరేటర్ పావని దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 4న 182 దరఖాస్తులు రాగా, 5న 178, 6న 306, 7న 333, 8న 621 , 9న 1603, 10వ తేదీన 2781 దరఖాస్తులు వచ్చాయి.

# గద్వాల ఎమ్మెల్యేకు భారీ ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ తీర్పు చెప్పారు. కృష్ణమోహన్ రెడ్డికి మూడు లక్షల జరిమానాను కూడా కోర్టు విధించింది. ఇందులో యాభై వేల రూపాయలు డీకే అరుణకు ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో తెలంగాణ హైకోర్టు తీర్పుపై కృష్ణ మోహన్ రెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలోనే తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు.. కృష మోహన్ రెడ్డి ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించారు. కొద్ది రోజుల క్రితం కొత్తగూడెం ఎమ్మెల్యేలపైనా ఇలాగే అనర్హతా వేటు వేశారు. దీంతో ఆయన సుప్రీంకర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. కొత్తగూడెంలో ఎమ్మెల్యే వనమా తో పోటీలో ఓడిపోయిన జలగం వెంకట్రావు ను ఎమ్మెల్యేగా ప్రకటించారు. కానీ సుప్రీంకోర్టు స్టే వల్ల ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. 2018 ఎన్నికల్లో బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీఆర్ఎస్ తరపున పోటీ చేశారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డీకే అరుణ దాదాపుగా 28వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని అనర్హతా వేటు వేయాలని డీకే అరుణ తర్వాత హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరుగుతూండగానే ఆమె పార్టీ మరిపోయారు. పార్లమెంట్ ఎన్నికల నాటికి బీజేపీలో చేరిపోయి.. ఆ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా మహబూబ్ నగర్ నుంచి పోటీ చేశారు. ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీ నేతగా కొనసాగుతున్నారు. హైకోర్టు తీర్పును అమలు చేస్తే ఆమె ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే అవుతారు. అయితే ఎమ్మెల్యే పదవి కాలం దాదాపుగా ముగిసిపోయే దశకు వచ్చింది. మళ్లీ ఎన్నికల కోసం కేసీఆర్ .. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఇందులోనూ.. కృష్ణమోహన్ రెడ్డి అభ్యర్థిగా చోటు దక్కించుకున్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ లో గెలిచి బీఆర్ఎస్ లోకి వచ్చారు.

# చంద్రబాబు @ 7691

(మొదటిపేజీ తరువాయి)

కేసు విచారణ టైంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చంద్రబాబు నాయుడి కేసులో సీఐడీ వాదనలతోనే ఏసీబీ కోర్టు ఏకీభవించింది. చంద్రబాబుకు 2 వారాలపాటు రిమాండ్ విధించింది. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన జస్టిస్ హిమబిందు.. చంద్రబాబుకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ తీర్పిచ్చారు. ఈ నెల 22 వరకు చంద్రబాబు రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారు. అనంతరం ఆయన్ని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. భారీ బందోబస్తు మధ్య పోలీసు పహారాలో రాజమండ్రి తరలించారు. తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని భావించిన టీడీపీ శ్రేణులు ఒక్కసారిగా నిరుత్సాహానికి లోనయ్యారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ప్రాథమిక ఆధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేసినట్లు ఏపీ సిఐడి వాదనలతో ఏసీబీ కోర్టు ఏకీభవించింది. గవర్నర్ అనుమతితో అరెస్ట్ చేయాలన్న వాదనలను సైతం కోర్టు కొట్టిపారేసింది. చంద్రబాబుకు రిమాండ్ అని తీర్పు రాగానే విజయవాడతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఉదయం నుంచి దాదాపు ఏడున్నర గంటలకు పైగా ఏసీబీ కోర్టులో వాదనలు కొనసాగాయి. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. రాజకీయ ఉద్దేశంతోనే అరెస్ట్ జరిగిందని, ఈ కేసులో 409 సెక్షన్ పెట్టడం సరికాదని వాదించారు. ఒకవేళ ఆ సెక్షన్ పెట్టాలంటే సరైన సాక్ష్యం చూపాలని ఏసీబీ కోర్టులో సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఒకానొక దశలో చంద్రబాబే తన కేసును వాదించుకున్నారు. న్యాయమూర్తి అనుమతితో వాదించే ప్రయత్నం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని.. చట్టం, నిబంధనలు ఏమీ పట్టించుకోకుండా ఇష్టారీతిన అరెస్టులు చేస్తోందని వివరించారు. అర్ధరాత్రి 11 గంటల సమయంలో తనను నిర్బంధంలోకి తీసుకుని, ఉదయం 6 గంటలకు అరెస్ట్ చూపారని తెలిపారు. రెండేళ్ల తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పోలీసులు తనను 37వ నిందితునిగా చూపి అరెస్ట్ చేశారని చెప్పారు. ఈ స్కామ్‌తో తనకు ఏ మాత్రం సంబంధం లేదన్నారు. సీఐడీ తరఫున ఈ కేసులో ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. చంద్రబాబు చేస్తున్న వాదన తప్పని పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకే ఆయన్ని అరెస్టు చేసినట్టు కోర్టుకు తెలిపారు. చట్ట ప్రకారమే అంతా జరిగిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు 371 కోట్లు దోచుకున్నారని కోర్టుకు వివరించారు. ఇదే కేసులో గతంలో రిమాండ్ తిరస్కరించిందని... అప్పుడు హైకోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేసిందని గుర్తు చేశారు.

## అప్పటికప్పుడు ఎఫ్ఐఆర్ లో బాబు పేరు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం జరిగినట్లు ఏపీ సీఐడీ పోలీసులు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబుని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. శు క్రవారం(సెప్టెంబర్ 8) అర్ధరాత్రి నుండి హైడ్రామా తర్వాత శనివారం (సెప్టెంబర్ 9)ఉదయం 6 గంటలకు నంద్యాలలో చంద్రబాబుని ఏపీ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. 24 గంటలలోపు న్యాయ స్థానం లేదా న్యాయమూర్తి ముందు హాజరు పరచాలన్న నిబంధన మేరకు ఆదివారం (సెప్టెంబర్ 10) ఉదయం 5 గంటలకు విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలో ఏసీబీ కోర్టు వద్దకు తండోపతండాలుగా తెలుగుదేశం అభిమానులు చేరుకోగా భారీగా పోలీసులు మోహరించారు. ఏసీబీ కోర్టు వద్దకు భారీ సంఖ్యలో న్యాయవాదులు కూడా చేరు కున్నారు. సీఐడీ అరెస్ట్, కేసు పూర్వాపరాలు, అరెస్ట్ చేసిన తీరు, నమోదు చేసిన సెక్షన్లు, చట్టబద్ధంగానే అరెస్ట్ చేసారా లేదా ఇలా పలు కోణాలలో కోర్టులో వాదనలు కొనసాగాయి. చంద్రబాబు తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది లూథ్రా వాదనలు వినిపించారు. కొన్ని గంటల పాటు కోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. కాగా, అరెస్ట్ అంశంలో ప్రధానంగా కొన్ని అంశాలు కోర్టుకు ఆగ్రహాన్ని తెప్పించాయి. పీసీ యాక్ట్ ప్రకారం వారం రోజులు ముందే నోటీసులు ఇవ్వాల్సి ఉండగా.. చంద్రబాబు అరెస్టుపై ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదు. ఆయన్ను అరెస్ట్ చేసేందుకు శిబిరం వద్దకు వచ్చిన సీఐడీ పోలీసులు అప్పటికప్పుడు ఆయనకు నోటీసులు ఇచ్చారు. అలాగే 2021లో ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదైతే అప్పుడు ఇందులో చంద్రబాబు పేరు లేదు. గతంలో ఎఫ్ఐఆర్ లో చంద్రబాబు పేరు లేకపోగా ఇప్పుడు తాజాగా ఆయన పేరు చేర్చి హడావిడిగా అరెస్ట్ చేసారు. అలాగే ఇప్పటికిప్పుడు రిమాండ్ రిపోర్టులో చంద్రబాబు పేరును చేర్చారు. అలాగే సెక్షన్ 17ఏ కింద అరెస్టు చేయాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి. కానీ, సీఐడీ పోలీసులు చంద్రబాబు అరెస్టు కోసం గవర్నర్ అనుమతి కోరలేదు. దీంతో ఇవే ఇప్పుడు సీఐడీ కొంపముంచాయి. చంద్రబాబు అరెస్టుపై ఏసీబీ కోర్టులో సుదీర్ఘ వాదనలు జరగగా ఎఫ్ఐఆర్ లో చంద్రబాబు పేరును ఇప్పటికిప్పుడు చేర్చడంపై ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సీఐడీ, ఏఏజీకి ప్రశ్నలు సంధించారు. గతంలో ఎఫ్ఐఆర్ చంద్రబాబు పేరు ఎందుకు చేర్చలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇప్పుడు చంద్రబాబు పేరు ఎందుకు చేర్చారో చెప్పాలని నిలదీశారు. అలాగే సెక్షన్ 409 కింద అరెస్ట్ చేసినట్లు సీఐడీ పేర్కొనగా.. అందుకు ఈ స్కామ్ లో చంద్రబాబు ప్రమేయంపై తగిన ఆధారాలున్నాయా అని న్యాయమూర్తి ఏఏజీని ప్రశ్నించారు. లాజికల్ గా జడ్జి అడిగిన ప్రశ్నలకు సీఐడీ అధికారులు, ఏఏజీ సుధాకర్ రెడ్డి ఖంగుతిన్నారని తెలుస్తోంది. ఆ ప్రశ్నల తర్వాత పది నిమిషాల పాటు వాదనలకు న్యాయమూర్తి బ్రేక్ ఇచ్చేంతగా కోర్టులో వాదనలు జరిగాయి. ఈ కేసు విచారణ సందర్భంగా ముందుగా న్యాయమూర్తి చంద్రబాబు నుంచి వాంగ్మూలాన్ని తీసుకున్నారు. ఈ క్రమంలో తన వాదనలు తానే వినిపించుకుంటానని చంద్రబాబు కోరగా న్యాయమూర్తి అంగీకరించారు. దీంతో తన అరెస్ట్ అక్రమమన్న చంద్రబాబు రాష్ట్రంలో పూర్తి స్థాయిలో కక్ష్ పూరిత పాలన జరుగుతుందని.. గతంలో జరిగిన ఉదంతాలను ఉటంకిస్తూ ఇప్పుడు తన అక్రమ అరెస్టును చంద్రబాబు న్యాయమూర్తి ఎదుట వినిపించారు. రాజకీయ లబ్ధి కోసమే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, సీబీఐ రిమాండ్ రిపోర్టు తిరస్కరించాలని న్యాయమూర్తిని చంద్రబాబు కోరారు.

గవర్నర్ అనుమతి లేకుండా తనను అరెస్ట్ చేశారని, తనపై కేసు నమోదు చేశారని, ఇది చట్ట విరుద్ధమని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు ఆనాటి కేబినెట్ నిర్ణయమని, ప్రభుత్వం 2015 బడ్జెట్ లో స్కిల్ డెవలప్మెంట్ అంశాన్ని కూడా పొందుపరిచామని, అది అసెంబ్లీ ఆమోదం పొందిందని గుర్తు చేశారు. అలాగే 2021లో నమోదైన ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టులో తన పేరు, తన పాత్ర గురించి పేర్కొనలేదని చంద్రబాబు వివరించారు. వాదన విన్న న్యాయమూర్తి మీరు కోర్టు హాల్లోనే ఉంటారా అని చంద్రబాబును ప్రశ్నించగా.. వాదనలు పూర్తయ్యేవరకూ కోర్టులోనే ఉంటానని చంద్రబాబు సమాధానం ఇచ్చారు. మొత్తంగా చంద్రబాబు వాంగ్మూలం, న్యాయవాదుల ప్రశ్నలకు సీఐడీ అధికారుల వద్ద సమాధానాలే కరువయ్యాయి.

# జీ-20 ఖర్చు రూ.4100 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ముగుస్తాయి.. ఇవీ జీ20 శిఖరాగ్ర సమావేశాల కోసం భారత్ చేసిన ఏర్పాట్లు.. ఇంతకీ ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి భారత్ ఎంత ఖర్చు చేసింది?జీ20 సమావేశాలకు 30 మంది దేశాది నేతలతో పాటు 14 మంది అంతర్జాతీయ సంస్థల అధినేతలు హాజరయ్యారు.. కొన్ని నివేదికల ప్రకారం ఈ శిఖరాగ్ర సదస్సు కోసం భారత్ 4100 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్టు సమాచారం. రహదారులు, సెక్యూరిటీ, ఫుట్ పాత్ లు, లైటింగ్ ఇతర పనుల కోసం ఈ డబ్బును ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. మేక్ ఓవర్ ప్రక్రియలో భాగంగా దేశ రాజధాని లోని వివిధ ప్రదేశాలలో శిల్పాలు కూడా ఏర్పాటు చేసింది. జీ20 శిఖరాగ్ర సమావేశాల కోసం గతంలో ఇతర దేశాలు కూడా పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేశాయి. 2018లో బ్యూనస్ ఎయిర్ సమ్మిట్ ఖర్చు 112 మిలి ల్యన్ డాలర్లు.. 2010 టొరంటోలో జరిగిన సమ్మిట్ కోసం కెనడా 715 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. వరి శిఖరాగ్ర సమావేశం 2022 నవంబర్‌లో జరిగింది.

2024 జీ20 సమావేశాలు బ్రెజిల్ లో జరుగుతాయి. జీ20 సదస్సు అనేది ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉంటుంది కాబట్టి.. ఈ శిఖరాగ్ర సమావేశాలను నిర్వహించే దేశం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ఏర్పాట్ల విషయంలో ఎటువంటి తేడా రాకుండా చూసుకుంటుంది. భారీగా ఖర్చు పెడితే పెట్టుబడులు, వివిధ రకాల ఒప్పందాలు తమ దేశం ప్రాతిపదికగా జరుగుతాయని భావిస్తుంది. లో జరిగిన శిఖరాగ్ర సమావేశాల్లో ఇదే జరిగింది కాబట్టి.. భారత్ కూడా ఇదే విధానాన్ని అనుస రించింది. అయితే ఈ విధానాన్ని ప్రతిపక్ష పార్టీలు తప్పుపడుతున్నప్పటికీ.. అధికార భారతీయ జనతా పార్టీ మాత్రం ఏమాత్రం లెక్క చేయడం లేదు. ఢిల్లీలోని మురికివాడలను ప్రస్తుతం తొలగించిన నేపథ్యంలో.. వారికి పునరావాసాన్ని కల్పించే ఆలోచనను ప్రభుత్వం చేస్తోంది.

# సీఐడీపైనే అనుమానం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టారని ప్రచారం జరిగింది. దీనిపై రమేష్‌గ్ర్భాంతి వ్యక్తం చేశారు. తన వాంగ్మూలంతో చంద్రబాబును అరెస్ట్ చేశారనటం హాస్యాస్పదంగా ఉదన్నారు రమేశ్. తాను అప్రూవర్‌గా మారాననే ప్రచారం అవాస్తవమన్నారు. అసలు ఫైలే లేకుండా కేసులు ఎలా పెడతారని సీఐడీని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఆర్థికశాఖ ఏ తప్పు చేయలేదన్నారు పీవీ రమేష్. సీఐడీ తీరుపై తనకు అనుమానం కలుగుతోందన్నారు. తాను చెప్పింది సీఐడీ తమకు అనుకూలంగా మార్చుకుందనే అనుమానం ఉందన్నారు. నిధులు విడుదల చేసిన వారిలో కొందరి పేర్లు కేసులో ఎందుకు లేవని నిలదీశారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ, కార్యదర్శిల పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించార పీవీ రమేశ్. ఎండీ, కార్యదర్శిల పాత్రే ప్రధానమని అన్నారు. వారి పేర్లు ఏవని నిలదీశారు.

# పాపం.. వాళ్లిద్దరికి ఎమ్మెల్సీ ఛాన్స్ లేనట్టే

(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్ లోనే ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్?తంది. ప్రభుత్వం నుంచి ఫైళ్లు వచ్చిన వెంటనే ఆమోదం తెలపలేనని, వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించిన తర్వాతనే తగిన నిర్ణయం తీసుకోవడం వీలవుతుందని, అందువల్లనే సమయం పడుతున్నదని గవర్నర్ ప్రకటించారు. వారిద్దరూ ప్రభుత్వం పేర్కొన్న కేటగిరీలో ఫిట్ అవుతారో లేదో? ఒక నిర్ణయానికి రావడానికి పరిశీలన చేయాల్సి ఉన్నదని, ఆ కారణంగానే ఇంకా ఆమోదం తెలపకుండా అబ్జర్వేషన్‌లో పెట్టినట్లు స్వయంగా గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర తొలి మహిళా గవర్నర్‌గా నియమితులైన తర్వాత నాలుగేండ్లు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నామినేటెడ్ ఎమ్మెల్సీ ఫైల్‌కు సంబంధించిన వివరాలను తమిళిసై సౌందర్ రాజన్ వెల్లడించారు. దీంతో సానుకూల ఫలితం వచ్చేంతవరకూ వెయిట్ చేయడం మినహా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణకు మరో అవకాశం లేకుండాపోయింది. గతంలో సోషల్ సర్వీస్ విషయంలో కౌశిక్‌రెడ్డి ఫైల్‌కు సైతం గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో ఆ ప్రయత్నం నుంచి ప్రభుత్వం వెనుకడుగు వేయక తప్పలేదు. రాజకీయాలతో సంబంధం ఉన్న వ్యక్తులకు ఎమ్మెల్సీ అవకాశాలను కల్పించుకునే స్వేచ్ఛ పార్టీలకు ఉంటుందిగానీ గవర్నర్ నామినేటెడ్ విషయంలో అర్హతలు, ప్రామాణికాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆమె నొక్కిచెప్పడంతో పరోక్షంగా వారికి తగిన అర్హతలు లేవన్న అంశాన్ని బహిర్గతం చేసినట్లయింది. నెల రోజులుగా ఈ ఫైల్ ఆమోదానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నప్పటికీ గత నెల 25న సచివాలయ ప్రాంగణంలో ఆలయాల ప్రారంభోత్సవానికి స్వయంగా సీఎం ఆహ్వానం పలికి స్వాగతించడంతో ఆమోదం లభిస్తుందని అనుకున్నారు. కానీ అది జరిగిపోయి కూడా పది రోజులు దాటింది. అయినా ఈ ఫైల్‌కు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. గవర్నర్ కేసీఆర్ ను పొగుడుతున్నారు. సూపర్ సీఎం అంటున్నారు కానీ.. బిల్లులు, ఎమ్మెల్సీల ఫైల్స్ పై సంతకం పెట్టేందుకు సిద్ధంగా లేరు. రాజ్‌భవన్‌కు, ప్రభుత్వానికి మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగితే అనేక భిన్నాభిప్రాయాలకు తావు ఉండదని తమిళిసై అంటున్నారు. గతంలో గవర్నర్ నరసింహన్‌తో నామినేటెడ్ ఎమ్మెల్సీ విషయంలో పెద్దగా చిక్కులు ఎదురుకానప్పటికీ తమిళిసై వచ్చిన తర్వాత తొలుత కౌశిక్‌రెడ్డి, ఇప్పుడు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణకు ఇబ్బందులొచ్చాయి.

# ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణమే చర్యలు

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా**




**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** జిల్లాప్రజల సమస్యలను పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా తెలిపారు. సోమవారం రోజున సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్ , రెవెన్యూ అదనపు కలెక్టర్ బిఎస్ లత, సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజావాణికి విచ్చేసిన ప్రజల నుండి 25 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి కష్టపడి తమ సమస్య లపైన వినతులను ఇవ్వడానికి ప్రతీ సోమవారం కలెక్టరెట్ కి ప్రజలు వస్తుంటారని ఆయా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టందుకు ఎల్లప్పుడూ వివిధ శాఖల అధికారులు కృషి చేస్తున్నారని కలెక్టర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తోపాటు గ్రీవెన్స్ లో వచ్చిన ధరఖాస్తులను పరిశీలించే విషయం లో అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరు స్తున్నారన్నారు. ఎంతో నమ్మకంతో తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరెట్ లో జరిగే ప్రజావాణి కి వచ్చే ప్రజలపట్ల జిల్లా యంత్రాంగం ఎప్పుడు సహాయ సహకారాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రజావాణిలో సంబంధిత వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# న్యూఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం

జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా విడుదల చేసే జాయింట్ డిక్లరేషన్ కు సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. ఈ న్యూఢిల్లీ డిక్లరేషన్ లోని మొత్తం 83 పేరాలను ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా ఆమోదించాయి. జీ 20 సదస్సు సందర్భంగా భారత్ రూపొందించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కు సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. జీ 20 అధ్యక్ష దేశంగా భారత్ కు ఇది గొప్ప విజయంగా భావించవచ్చు. అంతకుముందు, రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన పేరాపై కొన్ని అభ్యంతరాలు రాగా, ఆ పేరాలో భారత్ పలు మార్పులు చేసింది.జీ 20 సదస్సు జరుగుతున్న భారత్ మండపం లో సభ్య దేశాల ప్రతినిధుల మధ్య రెండో సెషన్ చర్చ జరుగుతున్న సమయంలో న్యూఢిల్లీ డిక్లరేషన్ కు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం లభించిన విషయాన్ని భారత ప్రధాని మోదీ వెల్లడించారు. అందరి సహకారం, కృషితో ఇది సాధ్యమైందన్నారు. "ఇప్పుడే శుభవార్త తెలిసింది. మా టీమ్స్ కృషి, మీ సహకారంతో న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం లభించింది" అని మోదీ ప్రకటించారు. "ఇందుకు సహకరించిన, కృషి చేసిన భారత మంత్రులు, అధికారుల బృందానికి, షేర్పాలకు, ఇతర అధికారులకు ధన్యవాదాలు" అన్నారు.జీ 20 సదస్సులో సభ్య దేశాల అధినేతలు సంయుక్తంగా ప్రకటించాల్సిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం లభించడం కొంత సమస్యగా మారింది. రష్యా - ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన అంశంపై డిక్లరేషన్ లో పేర్కొన్న లైన్స్ ను కొన్ని సభ్య దేశాలు, ముఖ్యంగా అమెరికా, యూరోప్ దేశాలు వ్యతిరేకించాయి. దాంతో, ఆ పేరాలో భారత్ పలు మార్పులు చేసింది. "రెండు రోజుల ఈ సదస్సులో కీలక నేతలు కొన్ని విలువైన సూచనలు చేశారు. మరి కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలూ తీసుకొచ్చారు. వీటన్నింటినీ పున:సమీక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత మాపై ఉన్నాయి. ఈ సదస్సులో చర్చించిన అంశాలపై వర్చువల్‌గా రివ్యూ చేసుకోవాలని ప్రతిపాదిస్తున్నాను. నవంబర్‌లో ఈ వర్చువల్ భేటీ చేయాలని భారత్ ప్రతిపాదిస్తోంది" ఐక్యరాజ్య సమితి గురించి ప్రస్తావించారు. ఐరాస స్థాపించినప్పటికి ఇప్పటికి ప్రపంచం చాలా మారిపోయిందని, ఈ మార్పులకు అనుగుణంగా యూఎన్ లో సంస్కరణలు చేయాల్సిన అవసరముందని సూచించారు. "ఐక్యరాజ్య సమితి స్థాపించినప్పుడు ప్రపంచం వేరు. ఇప్పుడు పరిస్థితులు వేరు. అప్పట్లో కేవలం 51 దేశాలకే సభ్యత్వం ఉండేది. ఇప్పుడా సంఖ్య 200కి చేరుకుంది. కానీ శాశ్వత సభ్యత్వం ఉన్న దేశాల సంఖ్యలో మాత్రం మార్పు రాలేదు. అప్పటికి ఇప్పటికి ప్రపంచం చాలా మారిపోయింది. ఇప్పటికి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు రావాల్సిన అవసరముందని ప్రధాని మోడీ తేల్చి చెప్పారు. జీ20 సదస్సులో కల్చర్ కారిడార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కల్చరల్ కారిడార్ జీ20 సభ్యులు, ఆహ్వానిత దేశాల భాగస్వామ్య వారసత్వాన్ని సూచిస్తుంది. ఇది జీ20 సభ్యులు, 9 ఆహ్వానిత దేశాల గుర్తింపు చిహ్నాలు.. గుర్తించదగిన సాంస్కృతిక వస్తువులు.. వారసత్వాన్ని కలిగి ఉంటుంది.ఈ కల్చర్ కారిడార్ విభిన్న సాంస్కృతిక వ్యక్తీకరణల అవగాహన.. వారసత్వాన్ని ప్రోత్సహించడానికి, జ్ఞానాన్ని పంచుకోవడం, చేరిక, సమానత్వం కోసం.. భాగస్వామ్య గుర్తింపు భావాన్ని పెంపొందించడానికి శక్తివంతమైన వేదికగా పనిచేస్తుంది. ఈ ప్రాజెక్ట్ భారతదేశం జీ20 థీమ్ 'వసుధైవ కుటుంబం', కల్చర్ వర్కింగ్ గ్రూప్ (అచిఉ) హాల్‌మార్క్ క్యాంపెయిన్ 'కల్చర్ యూనైట్స్ ఆల్' ఆధారంగా రూపొందించారు. జీ20 సదస్సు జరిగే భారత మండంపలో దీనిని ఆవిష్కరించి.. రెండు రోజుల పాటు ప్రదర్శించారు. దీనిలో దేశాల వారీగా జీ20 సభ్యులు, 9 ఆహ్వానిత దేశాల సాంస్కృతిక వస్తువులు, వారసత్వ వివరాలను ప్రతినిధులకు తెలిసేలా.. ఏర్పాట్లు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకోకి గ్యావెల్ కు జీ 20 అప్పగించారు. వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జీ20 సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు ప్రధాని మోదీ. ఇందుకు సంకేతంగా గ్యావెల్ అప్పగించారు. తనకు ఎంతో సన్నిహితుడైన లూయిజ్‌కి గ్యావెల్ అందిస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో స్పందించారు. గాంధీజీకి నివాళులర్పించడం ఎంతో భావోద్వేగానికి గురి చేసిందని వెల్లడించారు. అహింసా మార్గంలో దశాబ్దాల పాటు ముందుకు నడిచారని, అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసలు కురిపించారు. అంత గొప్ప వ్యక్తికి ఇలా శ్రద్ధాంజలి ఘటించడం చాలా ఉద్వేగంగా అనిపించిందని వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో మహాత్మా గాంధీజీ స్ఫూర్తి తప్పకుండా ఉంటుందని చెప్పారు.జీ20 2024 అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై బ్రెజిల్ అధ్యక్షుడు సంతోషం వ్యక్తం చేశారు. అంచనాలకు అనుగుణంగానే చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. జీ20 ని జియో పొలిటికల్ వివాదాలతో విడదీయటం సరికాదని తేల్చి చెప్పారు. కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, ఈ సమస్యపై దృష్టి సారించాలని సూచించారు. "బ్రెజిల్‌లో జరగనున్న జీ20 సదస్సులో మేం మూడు అంశాలకు ప్రాధాన్యతనివ్వనున్నాం. ఆకలిపై పోరాటం చేయడం, సుస్థిరాభివృద్ధి సాధించడం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకొచ్చేలా ప్రయత్నించడం. వీటిపైనే దృష్టి సారిస్తాం. జీ20ని జియోపొలిటికల్ అంశాలతో విడదీయడం సరికాదు. కేవలం డబ్బుల గురించే కాదు. ప్రజల ఆకలి గురించీ పట్టించుకోవాలి. సుస్థిరాభివృద్ధి ప్రమాదంలో పడుతోంది. ఆదాయంలో అసమానతలు ఉన్నప్పుడే ఇలాంటి సమస్యలు ఎదురవుతాయి".

## సమగ్ర శిక్ష ఉద్యోగుల రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు

మెదక్ - ప్రభాత సూర్యుడు

కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆదివారం నాడు జేఏసీ ఆధ్వర్యంలో 2వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.ఈ రోజు విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు అందరు కలిసి కలెక్టర్ ఆఫీస్ వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చాకలి ఐలమ్మకు విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు శంకర్ సార్ తెలిపారు.

# జనాభా ప్రామాణికంగా బీసీల రిజర్వేషన్లు పెంచాలి

**కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



జనాభా ప్రామాణికంగా బీసీల రిజర్వేషన్లను 25 శాతం నుంచి 40 శాతంకు పెంచాలని, ముదిరాజ్, తెనుగ కులస్తులను బీసీడీ లోంచి బీసీఏలోకి మార్చాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన తరగుతులకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలు చేసి, వారి అభివృద్ధికి బాటలు చేసేందుకు భారత రాజ్యాంగంలో పేర్కొన్న రిజర్వేషన్ల ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందించేందుకు కమిషన్లు వేసి, సిఫార్సులను అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వెనకబడిన కులాలు, అత్యంత వెనకబడిన కులాలకు జనాభా ప్రాతిపదిన రిజర్వేషన్లు అందకపోవడంతో రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్ 15(14), ఆర్టికల్ 16(4) ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన ప్రజలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు జనాభా ప్రాతిపదికన వెనకబడిన తరగతులకు రిజర్వేషన్లు ప్రస్తుతమున్న 25 శాతం రిజర్వేషన్లు 40 శాతానికి పెంచాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పకతప్పదన్నారు.

. తమను బీసీ-డీ కేటగిరి నుండి తమ సామాజిక, విద్యాపరంగా వెనకబాటుతనాన్ని పరిగణలోకి తీసుకొని బీసీ-ఏ కేటగిరిలో చేర్చాలంటూ ముదిరాజ్ సంఘాల నాయకుల విన్నపాల మేరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ వెనకబడిన తరగతుల కమిషన్ ముదిరాజులు సామాజిక, విద్యాపరమైన స్థితిగతులు, ఉపాధి, జీవన విధానాన్ని అధ్యయనం చేసి, బీసీ-డీ కేటగిరి నుండి ముదిరాజు కులస్తులను బీసీ-ఏలో చేర్చాలని సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా 2009లో ఉన్న సమయంలో వెనకబడిన తరగతుల కమిషన్ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, ముదిరాజ్లను బీసీ-డీ కేటగిరిలో నుండి బీసీ-ఏ కేటగిరిలోకి మార్చుతూ జీవో ఎంఎస్ నంబర్.15 ద్వారా 2009న ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ముదిరాజులను బీసీ-ఏ కేటగిరిలో చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, తమ రిజర్వేషన్లు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ బీసీ-ఏలోని కొన్ని వెనకబడిన కులాల సంఘాల నాయకులు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ వెనకబడిన తరగతుల చట్టం 1993 ప్రకారం ఇట్టి మార్పు చట్టవిరుద్ధమని అంటూ ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ 2009న హైకోర్టును ఆశ్రయించగా బీసీ-ఏ కేటగిరిలో చేర్చడం నిలిపివేయగా... ముదిరాజు కుల సంఘాల నాయకులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ముదిరాజులు సామాజిక, విద్యాపరమైన, ఆర్థిక స్థితిగతులు, ముదిరాజ్ జీవన విధానం, వృత్తి, కష్టాలను అధ్యయనం చేసి, వారి సామాజిక, విద్యా పరమైన అభివృద్ధి మెరుగుపడేందుకు ప్రత్యేక కేటాయింపులు, ఉన్న పరిధి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వెనకబడిన తరగతులకు చెందిన ప్రభుత్వోద్యోగులు, పాక్షిక ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగుల వివరాలు సేకరించడంతో పాటు వెనకబాటుతనానికి కారణమైన అంశాలను వెనకబడిన తరగతుల కమిషన్ అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి సూచించగా ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీవో 9 నంబర్ 2021న ఏర్పడిన వెనకబడిన తరగతుల కమిషన్ ఈ అంశాలను పరిశీలిస్తుందని భావిస్తున్నానని అన్నారు. విద్యాపరంగా వెనకబడిన కులాల జనాభా ప్రామాణికంగా రిజర్వేషన్లు అమలు చేయబడకపోవడంతో రిజర్వేషన్ల ఫలాలు ఆశించిన మేరకు అందడం లేదని, జనాభా ప్రామాణికంగా రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్న నేపథ్యంలో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరమైన వెనకబాటుతనాన్ని పరిగణలోకి తీసుకుంటూ ప్రస్తుతము ఉన్న 25 శాతం రిజ్వేషన్లను 40 శాతంకు పెంపు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో వెనకబడిన తరగతుల జాబితాలోని బీసీ-డీ గ్రూపు నుండి ముదిరాజు బీసీ-ఏ. జాబితాలో చేర్చేందుకు, బీసీ జనాభా ప్రాతిపదికన ప్రస్తుతమున్న 25 శాతం రిజర్వేషన్ను కనీసం 40 శాతానికి పెంచడంతో సంబంధిత కేటగిరీల్లో రిజర్వేషన్లు పెరగడం బలహీన వర్గాలు, సామాజిక, విద్యాపరంగా వెనకబడిన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ రాజ్యాంగంలో పేర్కొన్నవిధంగా వెనకబడిన తరగతుల ప్రజలకు రిజర్వేషన్ ఫలాలు అందించడం బాధ్యతగా గుర్తించి, రిజర్వేషన్ల పెంపునకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల్లోకి భువనేశ్వరి, బ్రాహ్మణి !

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం కోసం, ప్రజల కోసం కష్టపడుతున్న చంద్రబాబు, లోకేష్‌లపై వేధింపులకు పాల్పడుతున్నారని.. తప్పుడు కేసులో వేధిస్తున్నారని న్యాయం మీరే చెప్పాలని వారు ప్రజల వద్దకు వెళ్లే ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ పెద్దల్లో ఇప్పటికే ఓ కార్యాచరణ సిద్ధమయిందని చెబుతున్నారు. నారా లోకేష్ పైనా సీఐడీ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయనను కూడా అరెస్ట్ చేస్తామని పరోక్షంగా చెప్పారు. ఒక వేళ అదే జరిగితే పాదయాత్ర ఆపేయాల్సి ఉంటుంది. అందుకే.. వెంటనే.. విరుగుడుగా.. భువనేశ్వరి, బ్రాహ్మణిలు తెలుగుదేశం పార్టీ తరపున రంగంలోకి దిగుతారని.. లోకేష్ ఆపేసిన దగ్గర్నుంచి పాదయాత్ర చేయడమో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించడమో చేస్తారన్న వాదన వినిపిస్తోంది. రాజకీయాల్లో పండిపోయిన అందరికీ .. సానుభూతి ని మించిన అస్త్రం ఉండదని తెలిసి. వైఎస్ చనిపోయిన తర్వాత వచ్చిన సానుభూతి వెల్లువలో వైఎస్ జగన్ తడిచి ముద్దయ్యారు. ఉపఎన్నికల్లో భారీ విజయాలు సాధించారు. ఆదిలాబాద్ నుంచి చిత్తూరు వరకూ ఆ సానుభూతి వేవ్ కనిపించింది. గత ఎన్నికల్లోనూ ఆయన ఒక్క చాన్స్ అని వేడుకున్నారని ఆ సానుభూతే కనిపించింది కానీ టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత లేదన్న కొన్ని విశ్లేషణలు ఉన్నాయి. అదే ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండి.. ఇక ప్రతిపక్ష నేతలపై వేధింపులు అంటూ వారి కుటుంబసభ్యులు రోడ్డెక్కితే.. వచ్చే సానుభూతి వెల్లువ ఊహించడం కష్టమనే అంచనాలు ఉన్నాయి.

ముఖ్యంగా మహిళల్లో సానుభూతి పవనాలు వీస్తే ఫలితాలు పూర్తి స్థాయిలో ఏకపక్షమవుతాయన్న అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే జగన్ మోహన్ రెడ్డి తన కోసం పని చేసిన , పాదయాత్రలు.. ప్రచారాలు చేసిన తల్లి విజయలక్ష్మి, సోదరి షర్మిలను దూరం చేసుకున్నారు. అది కూడా చర్చకు పెట్టే అంశాలపై టీడీపీ దృష్టి పెట్టే అవకాశం ఉంది.రాజకీయ అధికారం ఎవరికైనా ప్రజలు ఇచ్చేదే. రాజ్యాంగం ద్వారా వచ్చేదే. ఆ అధికారాన్ని దుర్వినియోగంచ చేస్తున్నారని అనిపిస్తే.. ప్రజలు మరోసారి అధికారం అప్పగించడానికి సంశయిస్తారు. వేధింపులకు గురైన వారికి బాసటగా నిలుస్తారు. అనాదిగా వస్తున్న రాజకీయం అది. అయితే కక్ష సాధింపు రాజకీయాలు ఎప్పుడూ ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికల ఎజెండా కాలేదు. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఉండేది. ఇప్పుడు ఏపీలో ఆ తరహా రాజకీయాలు వచ్చాయి. అందుకే ఏపీ రాజకీయాల్లో రానున్న రోజుల్లో కీలక మార్పులు ఖాయమన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

# అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణలో అశువులు బాసిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. అటవీ సంపదను రక్షించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అటవీ శాఖ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని అభినందించారు.అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భద్రాది ? కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస రావు గతేడాది నవంబర్ 22న గుత్తికోయల చేతిలో ప్రాణాలు కొల్పోయారని, అడవుల సంరక్షణ కోసం ఆయన చేసిన త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. శ్రీనివాస రావు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడిందని, సీయం కేసీఆర్ గారు మానవత దృక్పథంతో శ్రీనివాస రావు సతీమణి నాలగక్ష్మికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం కల్పించారని తెలిపారు. అంతేకాకుండా రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు ఖమ్మం జిల్లాలో 500 గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రకృతి ప్రసాదించిన వన సంపదను రేపటి మన భవిష్యత్తు, భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అటవీ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే వారికి మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు?.అటవీ శాఖ ఆద్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు.2022- 2023వ సంవత్సరంలో అటవీ రక్షణలో భాగంగా అటవీ అధికారులు 79,735 కేసులను నమోదు చేసి, రూ.43.56 కోట్ల జరిమానాను విధించారు. రూ. 7.31 కోట్ల విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నారు. 15,122 వాహనాలను జప్తు చేశారు. 12,019 అటవీ భూ ఆక్రమణ కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన అగంతకులపై 26,408 కేసులు నమోదు చేసి రూ. 57.81 కోట్ల విలువ చేసే కలపను స్వాదీనం చేసుకున్నారు.ఇక అటవీ శాఖను బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగులను, సిబ్బంది నియామకాలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తోంది. గతేడాది 1393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల (ఈఐా'బ), 14 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు (ఈఖీూ'బ) ఉద్యోగాల నియామకాలకు ప్రభుత్వం అనుమ తినిచ్చింది. భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. అదేవిధంగా అటవీ అధికారులు, సిబ్బందికి 2,181 వాహనాలను సమకూర్చింది. జంగిల్ బచావో ? జంగిల్ బడావో నినాదం ద్వారా ఇప్పటికే ఉన్న అడవుల రక్షణతో పాటు క్షీణించిన అడవుల పునరుజ్జీవనం కొరకు ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున చర్యలు తీసుకొంటున్నాం అని మంత్రి ఇంద్రరణ్ రెడ్డి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్.. ఆదేశాల మేరకు అడవుల రక్షణ, స్మగ్లింగ్ ను అరికట్టడం కోసం అనేక సమగ్ర చర్యలు ప్రారంభించబడ్డాయి. శాఖాహార జంతువుల కోసం 1806.11 హెక్టార్ల విస్తీర్ణంలో సహజ గడ్డి క్షేత్రాలను అభివృద్ధి చేయడం, వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సోలార్ పంప్ సెట్లు, సాసర్ పిట్స్ ఏర్పాటు చేయడం, అడవి సరిహద్దులు సరి చూసుకొని పెంపుడు జంతువులు, పశువులను నియంత్రించేందుకు 10,732 కి.మీ పొడవున కందకాల ఏర్పాటులో అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బంది కృషి అభినందనీయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "తెలంగాణకు హరితహార కార్యక్రమం" ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 290 కోట్లకు పైగా మొక్కలను నాటాం. మీరు చేసిన కృషి వల్ల పచ్చదనం పెంపులో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు మన రాష్ట్రం సొంతం చేసుకుందని చెప్పారు. వీటితో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట తప్పకుండా?.. ఏళ్ల తరబడి అడవినే నమ్ముకున్న ఆదివాసీ, గిరిజన బిడ్డలకు భూమి హక్కు కల్పిస్తూ పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష యాభై వేల గిరిజన కుటుంబాలకు 4.06 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు అందజేస్తున్నాం. పట్టాలతోనే సరిపెట్టకుండా రైతు బంధు, రైతుబీమా పథకాలనూ అమలు చేస్తున్నామని అన్నారు. పోడు భూముల సమస్య పరిష్కారం వల్ల గిరిపుత్రులకు- అటవీ సిబ్బందికి మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించ గలిగాచామని.. భవిష్యత్ లో అటవీ భూములు అన్యక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

## కలశ పూజలో ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



జగిత్యాల - ప్రభాత సూర్యుడు

జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ కలశ పూజా కార్యక్రమానికిజగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు..ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన కాలం నుండి ఈత తాటి కల్లు ఆరోగ్యానికి మంచిదని మన పూర్వీకులు చెప్పేవారన్నారు.తెలంగాణ రాష్ట్రంలో గౌడ కుల వృత్తికి ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు . మరణించిన గౌడకులస్తులకు,ప్రమాదంలో గాయపడ్డ వారికి ఇటీవల ప్రభుత్వం 12 .5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. నేడు గౌడన్నలకి 50 ఎండ్ల కే 2 వేల పెన్షన్ ఇస్తున్నామని దేశం లో ఎక్కడా లేదని అన్నారు..గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ నర్సరీల్లో ఈత తాటి మొక్కల్ని పెంచడం జరిగిందని ,రాష్ట్రంలో 4 కోట్ల ఈత తాటి మొక్కలు నాటామని,4 లక్షల ఈత తాటిమొక్కలు జగిత్యాల నియోజకవర్గంలో నాటడం జరిగిందని అన్నారు.. నియోజకవర్గంలో గౌడ సంఘ భవనాలకు,ఎల్లమ్మ ఆలయాలకు నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు.ఎక్సైజ్ సర్కిల్ ను ధర్మపురి నుండి జగిత్యాల కి మార్చామని అన్నారు...ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్,మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం,ఎంపిటిసి సౌజన్య తిరుపతి, ఆరే రవి,నక్క హరీష్, దుంపల కరుణాకర్ రెడ్డి, మెడపట్ల శేఖర్ ,గొల్లపల్లి రవి,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తికి తీవ్ర గాయాలు



**సూర్యాపేట- ప్రభాత సూర్యుడు :** రోడ్డు ప్రమాదంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సుజాతకి తీవ్రగాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా చివ్వెల మండలం గుంపుల తిరుమలగిరి సమీపంలో ఘటన జరిగింది. వర్షంలో న్యాయమూర్తి కారు అదుపుతప్పి పల్టీ కొట్టినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడ్డ న్యాయమూర్తికి సమీప ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసారు. సమాచారం తెలియగానే తెలంగాణ రాష్ట్ర మంత్రి జగదీశ్ రెడ్డి ఆమెను మెరుగైన చికిత్స కోసం తన కాన్వాయ్లో హైదరాబాద్కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు అలర్టై జాతీయ రహదారి పొడవునా కాన్వాయ్కు అడ్డంకులు లేకుండా చూసారు.

## అదుపుతప్పి ప్రైవేట్ బస్సు బోల్తా

**నిర్మల్- ప్రభాత సూర్యుడు :** నిర్మల్ జిల్లా నిర్మల్ రూరల్ మండలంలోని అనంతపేట్ గ్రామ సమీపంలో 44 జాతీయ రహదారిపై అదుపుతప్పి ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏఆర్ 01 వై 0331 ప్రైవేటు ట్రావెల్ బస్సు సోమవారం ఉత్తరప్రదేశ్ నుంచి బెంగళూరు వెళ్తోంది. డ్రైవర్ నిద్ర మత్తులోకి వెళ్లడంతో అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు, డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని హైవే సిబ్బంది అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని రూరల్ ఎస్సై చంద్రమోహన్ పరిశీలించారు.

## అభివృద్ధిలో పోటీ పడుతున్నాం

### మంత్రి హరీశ్ రావు

**సిద్దిపేట- ప్రభాత సూర్యుడు:** అప్పట్లో చంద్రబాబు ఐటి ఐటీ అనేవాడు. పాపం చంద్ర బాబు అరెస్ట్ అయ్యి జైల్ లో ఉన్నాడు. ఆయన గురించి మాట్లాడవద్దేమో కానీ... సీఎం కెసిఆర్ హైదరాబాద్ ఐటీతో గ్రామాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేశాడని మంత్రి హరీష్ రావు అన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ,పంజాబీ, గుజరాత్ లో కరెంట్ కోతలు ఉన్నాయి, కానీ తెలంగాణ లో కరెంట్ కోతలు లేవు. ఏ సెక్టార్ లో చూసిన వృద్ధి రేటులో తెలంగాణ ముందుంది. దేశంలో అతి ఎక్కువ తలసారి ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలోని ప్రతి పక్షాలు తిట్లలో పోటీ పడితే మేము అభివృద్ధి లో పోటీ పడుతున్నామని అయన అన్నారు.

## రామాయంపేటలో ఆశ వర్కర్లను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

**మెదక్ - ప్రభాత సూర్యుడు:** రామాయంపేట మండలంలో ఆశ వర్కర్లు నేడు హైదరాబాదులోని కమిషనరేట్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమానికి వెళుతుండగా అడ్డుకొని హైదరాబాద్ వెళ్లకుండా రామాయంపేట పోలీసులు ముందస్తుగా 15 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.పోలీస్ స్టేషన్ ముందు ఆశ వర్కర్లు పారితోషికం మాకొద్దు కనీస వేతనం కావాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ ఆశా వర్కర్లు గ్రామాలలో అనేక సేవా కార్యక్రమాలు చేపడం జరుగుతుందని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం ప్రజలలోకి తీసుకెళ్లే విధంగా కృషి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. కరోనా సమయంలో మరణించిన ఆశ వర్కర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు బాలమణి,ఆశ వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు పద్మ అనిత, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్షన్లో పోలీసుల పాత్ర చాలా కీలకం

### జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం నిబంధనలు పాటిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు నిర్వహణలో పోలీస్ ల పాత్ర చాలా కీలకమైందని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాబోవు రాష్ట్ర శాసనసభ ఎన్నికల నియమావళి, ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులు తీసుకోవలసిన చర్యలపై మాస్టర్ ట్రైనర్ పడాల తిరుపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ చే శిక్షణ తరగతులు నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎలక్షన్స్ సందర్భంగా పోలీసులు అందరూ ఎన్నికల సంఘం నియంత్రణలో, పర్యవేక్షణ, క్రమశిక్షణకు లోబడి పని చేయాలని సూచించారు.జగిత్యాల జిల్లాలో 5 నియోజకవర్గాల పరిధిలో ఉండటం జరిగిందని ఇప్పటికే ఎన్నికల విధులకు సంబంధించి పోలీస్ సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు.. .ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు ప్రకారం ఎన్నికలను ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని, ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశంపై అధికారులు సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలి. ఒకటికి రెండుసార్లు విషయాలు తెలుసుకొని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు.పోలీసు అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాలలో ఎలాంటి సమస్యలు లేకుండా, సమస్యలు సృష్టించే వారినీ బైండోవర్ చేయాలని తెలిపారు. ఇంతకు ముందు ఎలక్షన్స్ సమయంలో సమస్యలును సృష్టించిన వారి పై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్ అధికారులు ఎలక్షన్ సమయంలో సమస్యలు సృష్టించే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను విధిగా పర్యటిస్తూ గ్రామాలపై దృష్టిసారించాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి పై పోలీసు అధికారులకు అవగాహన కలిగించిన మాస్టర్ ట్రైనర్ పడాల తిరుపతి ని సన్మానించి, ప్రశంస పత్రం అందజేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర రావు, డిఎస్పీలు రవీంద్ర కుమార్ ,వెంకటస్వామి, రవీంద్ర రెడ్డి, రఘు చందర్,డీవీ రంగారెడ్డి, ఎస్బీ ,సిసిఎస్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు,సి.ఐలు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ బరిలో వుంటా

### రామ్మోహన్ గౌడ్

**రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు:** ఈసారి ఎల్బీనగర్ నుండి తప్పక పోటీ చేస్తున్నాం. నా భార్య లక్ష్మీప్రసన్న బలో ఉంటారు. బీఆర్ఎస్ పార్టీ నుండి బిఫామ్ మాకే వస్తుంది. కెసిఆర్ ఎల్బీనగర్ టికెట్ విషయంలో పునాలోచిస్తారని నమ్మకం ఉందని ఎల్బీనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి రామోహన్ గౌడ్ అన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి వ్యతిరేకంగా రామ్మోహన్ గౌడ్ ఇంటి వద్ద నియోజకవర్గంలో ని కార్పొరేటర్ లు,మాజీ కార్పొరేటర్లు ,పార్టీ ముఖ్య నాయకులు సమావేశం అయ్యారు.

## కోమటిరెడ్డి చుట్టూనే నల్గొండ జిల్లా

(మొదటిపేజీ తరువాయి)

సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్, నాగార్జున సాగర్, నియోజకవర్గాలు మినహా మిగిలిన ఎనిమిది చోట్లా ఆయన వేలు పెడుతున్నారు. తన అనుచరులకు, లేదా తన బాగా నమ్ముకున్న వారికి టికెట్ల కోసం ప్రయత్నం చేస్తున్నారు. చివరకు సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి ప్రభావంతో రాజకీయాలు నడిచే మిర్యాలగూడెం, దేవరకొండ నియోజకవర్గాల్లోనూ ఆయన సొంతంగా అభ్యర్థులను సిద్ధం చేశారు. దీంతో ఇపుడు నల్లగొండ కాంగ్రెస్ రాజకీయం ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చుట్టూ తిరుగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నల్లగొండ శాసన సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున అయిదో సారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ మరుసటి ఏడాదే జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కోమటిరెడ్డి భువనగిరి లోక్ సభా నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. వాస్తవానికి ఆ స్థానం నుంచి 2009 లో భువనగిరి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించిన ఆయన తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2014 ఎన్నికల్లో ఓటమి పాలై ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. ఎమ్మెల్సీగా పదవిలో ఉండగానే.. 2018 ఎన్నికల్లో ఆయన మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో 2019 లోక్ సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీ చేయడానికి అభ్యర్థులు లేని సయమంలో అప్పటికే నల్లగొండ అసెంబ్లీ స్థానంలో పరాజయం పాలైన ఆయన ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఇక అప్పటి నుంచి భువనగిరిపై పెత్తనం కోసం బాగానే రాజకీయ ఎత్తుగడలు వేశారు.

ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో తన అనుచరుడు బీర్ల ఐలయ్య యాదవ్ ను ఎంకరేజ్ చేయడంతో పాటు, భువనగిరి అసెంబ్లీ స్థానంలో రామాంజనేయులు గౌడ్, శివరాజ్ గౌడ్ అనే అనుచరులను పోటీ దారులుగా తయారు చేశారు. కానీ, అప్పటికే ఇక్కడ నుంచి డీసీసీ అధ్యక్షుడ కుంభం అనిల్ కుమార్ రెడ్డికి పొగబెట్టారు. ఆయన టీపీసీసీ మాజీ చీఫ్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి దగ్గరి అనుచరుడు. అంతే కాకుండా 2018 ఎన్నికల్లో భువనగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. డీసీసీ అధ్యక్షునిగా ఉన్నా.. ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో పొసగక, పార్టీని వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. బీజేపీని వీడి కాంగ్రెస్లోకి రావాలని చూస్తున్న జిట్టా బాల్రిష్ణారెడ్డికి ఇప్పటివరకు పచ్చజెండా ఊపలేదు. టీపీసీసీ నాయకత్వం ఏకగ్రీవంగా జిట్టాను పార్టీలో చేర్చుకోవడానికి సుముఖంగా ఉన్నా.. కోమటిరెడ్డి అంగీకారం తెలపలేదన్న కారణంతో ఇంకా జిట్టాకు కండువా కప్పలేక పోతున్నారు. ఇక, కుంభం అనిల్ కుమార్ రెడ్డి పార్టీ మారిన తర్వాత భువనగిరి డీసీసీ అధ్యక్షుని నియామకంలో తన పట్టు నిరూపించుకుని తాను అనుకున్న వ్యక్తికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇప్పించుకున్నారు.కేవలం భువనగిరి వరకే కోమటిరెడ్డి పరిమితం కాలేదు. ఇదే లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ కోమటిరెడ్డి మాటే చెల్లుబాటు అవుతుంది. 2009 నుంచి ఆయన ఇక్కడి తన అనుచరిని టికెట్ ఇప్పించుకోవడంలో సక్సెస్ అయ్యారు. 2009లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే గెలిచిన చిరుమర్తి లింగయ్య కోమటిరెడ్డి దగ్గరి అనుచరుడే. ఆయన 2014 ఓటమి పాలైనా.. 2018 లోనూ లింగయ్యే టికెట్ వచ్చేలా చక్రం తిప్పారు. ఆ ఎన్నికల్లో గెలిచిన లింగయ్య ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరడంతో ఇక్కడ కొత్త నాయకులను తయారు చేశారు. దైద రవీందర్ అనే నాయకుడికి ఎన్నికల్లో అవకాశం ఇప్పిస్తానని తన వెంట తిప్పుకున్నారు. రెండు మూడు నెలలుగా మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య తనయుడు వేదాసు శ్రీధర్ కూ అభయ హస్తం ఇచ్చి వెంట తిప్పుకుంటున్నారు. మారిన రాజీకీయ సమీకరణాల్లో బీఆర్ఎస్ లో టిక్కెట్ దక్కని మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్ లోకి రావాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నా.. కోమటిరెడ్డి పచ్చ జెండా ఊపని కారణంగానే ఇంకా ఆయన చేరిక డైలమాలో ఉందని చెబుతున్నారు.మరో వైపు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే బాలూ నాయక్ కు దాదాపు టికెట్ ఖరారు అవుతుందని అంతా భావిస్తున్న తరుణంలో కిషన్ నాయక్ అనే మరో నాయుడు పోటీ దారుగా తయారయ్యారు. కిషన్ నాయక్ కోమటిరెడ్డి ఆశీస్సులతోనే దేవరకొండలో రాజకీయాలు మొదలు పెట్టారని చెబుతున్నారు. మిర్యాల గూడెంలో కుందూరు జానారెడ్డి తనయుడ కుందూరు రఘువీర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. కానీ, ఇక్కడా అడ్డం పడుతూ.. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా ఉన్న బత్తుల లక్ష్మారెడ్డి (బి.ఎల్.ఆర్)కి అండగా నిలిచి గట్టి టికెట్ పోటీదారుగా ఆయనను తయారు చేశారు. మెజారిటీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేలు పెడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చుట్టూనే ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ రాజకీయం నడుస్తోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది

## బాధిత కుటుంబాలకు 7 లక్షల 50 వేల ఎల్వోసీని అందజేసిన విద్యాసాగర్ రావు



**కోరుట్ల - ప్రభాత సూర్యుడు:** అనారోగ్యంతో బాధపడుతున్న పలు బాధిత కుటుంబాలకు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు 7 లక్షల 50 వేల రూపాయల విలువగలఎల్వోసీ ని అందజేశారు...అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నట్లు స్థానిక నాయకులతో కలిసి విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సీఎం సహా నిధి ద్వారా మంజూరైన పలువురి బాధిత కుటుంబాలకు ఎల్వోసీ అందజేశారు. ఈ మేరకు సోమవారం మెట్ పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెట్ పల్లి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జే.శ్రీనివాస్ కు 2 లక్షలు,జే.వంశీ కీ 2 లక్షల యాభై వేలు, ఆత్మకూర్ గ్రామానికి చెందిన బి. రమేష్ కు 1లక్ష యాభై వేలు అలాగేకోరుట్ల పట్టణానికి చెందిన సాజీదా బేగం కు 1 లక్ష యాభై వేలు మొత్తం నలుగురికి సీఎం సహాయనిధి నుండి మంజరైన 7 లక్షల 50 వేల రూపాయల విలువగల ఎల్వోసీ చెక్కులను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చేతులమీదుగా వారికి అందజేశారు..ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముజఫర్ (సజ్జు),ఎండి సాబీర్ అలీ, మైనార్టీ నాయకులు సయ్యద్ ఫాయిం,హఫీజ్, రఫీ, రహీం, రావుఫ్, సలీం ఖురేషి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు..

## జంగల్ బచావో.. జంగలన్ బడావోను అమలు చేయాలి

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** అడవులు, పర్యావరణం, పచ్చదనం లేని సమాజాన్ని మనం ఊహించలేము. అందుకే తెలంగాణ ఏర్పాటైన తొలినాళ్లలోనే సమతుల్య పర్యావరణం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఇప్పుడు దశాబ్ది తెలంగాణలో ఆ సంకల్పం ఫలితాలు చూస్తున్నాం.

అడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం సంకల్పించిన తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి అన్ని వర్గాల మద్దతు లభించటంతో ఇవాళ మనం అద్భుతమైన ఫలితాలను చూస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అయన సందేశాన్ని ఇచ్చారు. . హైదరాబాద్ లాంటి కాంక్రీట్ కీకారణ్యంలో కూడా ఊహించనంత పచ్చదనం పెరగడంతో అంతర్జాతీయ ఉద్యానవన ఉత్పత్తిదారుల సంఘం అందించే వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్ – 2022 హైదరాబాద్ కు దక్కింది. అభివృద్ధి ఎంత సాధించినా, సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా ప్రకృతి పరిరక్షణ మన ప్రాథమిక ధ్యేయం. పర్యావరణ పరంగా తగిన రక్షణ చర్యలు చేపట్టని ఫలితమే గ్లోబల్ వార్మింగ్ రూపంలో చూస్తున్నాం. అందుకే మనతో పాటు, భవిష్యత్ తరాలు కూడా ఈ పుడమిపై జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215